
ప్రజాశక్తి
గురువారం 13 ఏప్రిల్ 2023
5
అనంతపురం





ఈబీసీ నేస్తం మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

21,539 మందికి ఈబీసీ నేస్తం

రూ.32.31 కోట్ల నగదు జమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

45 ఏళ్లు దాటిన అగ్రవర్ణ పేద మహిళలకు ఒక్కొక్కరికి ప్రతి సంవత్సరం రూ.15 వేల ఆర్థిక సహాయం అందించే ఈబీసీ నేస్తం రెండవ విడత నగదు బదిలీ కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ లో నిర్వహించారు. లబ్ధిదారులకు కలెక్టర్ ఎమ్.గౌతమి చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈబీసీ నేస్తం రెండవ విడత ద్వారా జిల్లాలో 21,539 మందికి రూ.32.31కోట్ల రూపాయలు నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల జాబితాలో లేని అర్హులు స్థానిక సచివాలయం, వాలంటీరు ద్వారా మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మీసాల రంగన్న, ఆర్టీసీ రీజనల్ ఛైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, వక్ఫ్ బోర్డు ఛైర్‌పర్సన్ రిజ్వాన్, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని, జిల్లా బీసీ సాధికార, సంక్షేమ అధికారి ఖుష్బు కొరారితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సూరీడు సుర్రుమంటున్నాడు. గత పది రోజులుగా భానుడి భగభగలు పెరిగాయి. ఉదయం 10 గంటల నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఓ వైపు ఎండ వేడిమి, మరో వైపు ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు మధ్యాహ్న సమయంలో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటనే భయపడుతున్నారు. గత ఆరు రోజులుగా ప్రతి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ నెలాఖరుకు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.



సుర్రుమంటున్న సూరీడు..!

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా నమోదు అయిన ఉష్ణోగ్రతలు

తేది	గరిష్టం	కనిష్టం
06	41.2	22.8
07	40.7	23.2
08	40.8	23.6
09	40.9	21.4
10	41.2	22.6
11	41.6	23.4
12	41.7	23.2
శ్రీ సత్యసాయి జిల్లా		
06	40.4	22.1
07	40.2	22.8
08	39.7	23.1
09	40.6	21.1
10	40.5	27.3
11	41.3	22.6
12	41.5	22.8

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- 41 డిగ్రీలకు పైగా నమోదు ◆ ఉదయం 10గం॥ నుంచే ఎండలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న జనం ◆ బయటకు రావాలంటనే భయం



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏప్రిల్‌లోనే ఎండలు మండుతున్నాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు రెండింటిలోనూ ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. మధ్యాహ్న సమయాల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. దీనికితోడు పల్లెల్లోనూ, పట్టణాల్లోనూ విద్యుత్ కోతలూ ఉంటుండటంతో జనం ఉక్కపోతాలతోనూ అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఏమిటని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా 41 డిగ్రీలకు పైగానే..

ఉమ్మడి జిల్లాలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 41 డిగ్రీలకు పైగానే నమోదు అయ్యాయి. అనంతపురం జిల్లాలో పరిశీలిస్తే ఈ నెల 6వ దీన 41.6, 7న 40.7, 8న 40.8, 9న 40.9, 10న 41.2, 11న 41.6, 12న 41.7 డిగ్రీలు నమోదు అయ్యింది. ఇక సత్యసాయి జిల్లా విషయానికి వస్తే ఈ నెల 6న 40.4, 7న 40.2, 8న 39.7, 9న 40.6, 10న 40.5, 11న 41.3, 12న 41.5 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రానున్న రోజులు ఇది మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గతేడాదీ అత్యధికం..

గతేడాదిలో ఉమ్మడి జిల్లా వాసులను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఏప్రిల్ 3వ వారంలో ఏకంగా 43.1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఈ స్థాయిలో ఉష్ణోగ్రత 2016, 2017 తరువాత ఆ ఏడాదే నమోదయ్యింది. 2016వ సంవత్సరంలో ఏప్రిల్ నెలలో గరిష్టంగా నమోదయిన ఉష్ణోగ్రత జిల్లాలో 44.5 డిగ్రీలు. ఆ తరువాత 2017లో ఇదే మాసంలో 43.7 డిగ్రీలు గరిష్టంగా నమోదయింది. ఆ తరువత 2018లో గరిష్టంగా 42.3 డిగ్రీల, 2019లో 42.9 డిగ్రీలు, 2020లో 41.9 డిగ్రీలు, 2021లో 41.6 డిగ్రీలు నమోదయింది. గతేడాది 2022లో ఏప్రిల్ 21వ తేదీన గరిష్టంగా 43.1 డిగ్రీలు ఉష్ణోగ్రత జిల్లాలో నమోదయింది. ఈ ఏడాదికూడా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఉక్కపోతలతో అల్లాడుతున్న జనం

ఎండలకు తోడు ఉక్కపోత అధికంగా ఉండటంతో జనం అల్లాడుతున్నారు. దీనికితోడు విద్యుత్ కోతలు కూడా జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కరెంటు లేకుండాపోతుండటంతో జనం ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక అవస్థ పడుతున్నారు. కరెంటు ఉంటే కూలర్లు, ఎసిలు ఆన్ చేసుకుని కాస్త సేదదీరేందుకు ప్రయత్నిస్తున్నారు.

శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ

ఎండ వేడిమి పెరగడంతో శీతలపానియాలు, జ్యూస్ కేంద్రాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. అదే సమయంలో మినరల్ వాటర్ ప్లాంట్లలోనూ ప్రత్యేకంగా కూలింగ్ వాటర్ క్యాన్లను అమ్ముతున్నారు. వీటి ధర గతంలో రూ.20 ఉండగా, ఇప్పుడు రూ.40 వరకు ఉంటోంది. వీటిని మంచి గిరాకీ పెరిగింది. ఫ్రిజ్‌లు, ఎసిల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎండ వేడిమి నుంచి తప్పించుకునేందుకు వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్పీ కె.శ్రీనివాసరావు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం నూతన ఎస్పీగా కె.శ్రీనివాసరావు బాధ్యతలను స్వీకరించారు. బుధవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి అన్నారు. జిల్లాలోని సమస్యలపై అవగాహన చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామన్నారు. చట్టబద్ధంగా, న్యాయంగా వ్యవహరిస్తామని చెప్పారు. సామాన్యులకు పూర్తిస్థాయి అందుబాటులో పోలీసులు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకారం తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల కోసం జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలియజేశారు. వేసవిని దష్టిలో ఉంచుకుని విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బంది పడకుండా వారికి కళ్లజోడు, హ్యాండ్ గ్లవ్స్, క్యాప్స్, వాటర్ బాటిళ్లు, తదితర సురక్షిత వస్తువులున్న కిట్లను సిద్ధం చేయాలని అదనపు ఎస్పీకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావు కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో ఉన్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని కలిశారు. జిల్లా విషయాలపై ఇద్దరూ మాట్లాడుకున్నారు.

మొలకలపెంట కిడ్నీ బాధితులను ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



మొలకలపెంట కిడ్నీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గుంతకల్లు మండలం, మొలకలపెంట గ్రామంలో కిడ్నీ వ్యాధి తీవ్రంగా ఉందని, వెంటనే ప్రభుత్వం ఆ గ్రామానికి వైద్య నిపుణులను పంపి కారణాలను పరిశీలించి వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను తెలుసుకునేందుకు సిపిఎం ప్రతినిధుల బృందం మొలకలపెంట గ్రామంలో మంగళవారం పర్యటించారు. బాధితులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. దీనిపై బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొలకలపెంట గ్రామంలో కిడ్నీ వ్యాధితో పలువురు బాధపడుతున్నారని చెప్పారు. ఈ గ్రామంలో ఇప్పటికే ఈ వ్యాధితో నాగార్జున, యల్లప్ప మరణించారని తెలిపారు. వారంలో మూడు రోజులు అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రిలో వీరు డయాలసిస్ చేయించుకుంటున్నారని తెలిపారు. అనంతపురం వెళ్లడానికి ఒక వ్యక్తికి వారానికి రూ.2500 వేలు ఖర్చు అవుతోందన్నారు. నెలకు రూ.11 వేల నుంచి రూ.16 వేలు మందులు రాసి ఇస్తున్నట్లు రోగుల కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ప్రకాష్ అనే వ్యక్తి గత ఎనిమిది నెలలుగా డయాలసిస్ చేయించుకోవడం వల్ల ఆయనకు ఉన్న ఎకరం పొలం అమ్మేసినట్లు బృందానికి తెలిపారు. ఆయనకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారన్నారు. ఈ తమ్ముడు నాగార్జున ఐదు నెలల క్రితం కిడ్నీ సమస్యతో మరణించాడని తెలిపారు. గ్రామంలో అనేక మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నప్పటికీ పరీక్షలు చేయించుకోవడానికి భయపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా అధికారులు స్పందించి మొలకలపెంట గ్రామానికి వైద్య నిపుణుల బృందాన్ని పంపి వ్యాధి కారణాలను గుర్తించాలన్నారు. డయాలసిస్ రోగులను అనంతపురం తీసుకురావడంతో పాటు, వారిని మళ్లీ గ్రామానికి చేర్చే విధంగా రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. వారి పిల్లల చదువులు మధ్యంతరంగా ఆగిపోకుండా అమ్మాయిలను కస్తూరిబా, అబ్బాయిలను గవర్నమెంట్ హాస్టల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు అందరికీ డయాలసిస్‌తో సంబంధం లేకుండా పింఛన్ ఇవ్వాలని కోరారు.

98-డీఎస్సీ అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న 1998 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థుల కల ప్రస్తుతం నెరవేరింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హత పొందిన 536 మంది అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో మినిమం టైం స్కేల్ కింద సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఉద్యోగంలోకి తీసుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం నగరంలోని జిల్లా సైన్ సెంటర్‌లో 280 మంది అభ్యర్థులు కౌన్సిలింగ్‌కి రావాల్సి ఉండగా అందులో 251 మంది హాజరు అయ్యారు. హాజరైన వారికి మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించారు. అంతకుముందు అధికారులు అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం కౌన్సిలింగ్‌కి హాజరైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ అందజేశారు. మిగిలిన అభ్యర్థులకు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించి నియమక ఉత్తర్వులు అందజేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియని ప్రభుత్వ నిబంధనల ప్రకారంగానే నిర్వహిస్తామని డిఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి, డిప్యూటీ డిఇఒలు రంగస్వామి, పద్మప్రియ, శంకర ప్రసాద్, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో క్రమశిక్షణకు పెద్దపీట : ప్రభాకర్ చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, ఏరియా ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పార్టీ అభివద్ధికి పాటుపడాలని, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. బుధవారం టిడిపి అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో ఏరియా, క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ తేది లోగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్లస్టర్ ఏరియా ఇన్చార్జిలు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు..!

- ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు వైసిపి ఎమ్మెల్యేల చేతికి బ్యాగులు
- భవిష్యత్తులో అన్ని వర్గాలకూ అండగా నిలుస్తాం
- యువగళంలో నారా లోకేష్
- రాయలచెరువు బహిరంగ సభకు భారీగా తరలొచ్చిన టిడిపి శ్రేణులు



యువగళం పాదయాత్రలో పాల్గొన్న నారా లోకేష్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు, యాడికి

యువగళం పాదయాత్ర, ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు వచ్చాయని, భవిష్యత్తులో ఇదే కొనసాగుతుందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర బుధవారం 68వ రోజు అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలో కొనసాగింది. పసలూరు నుంచి ప్రారంభం అయిన యాత్ర కొట్టాలపల్లి, కమ్మవారిపల్లి, నగరూరు, తుట్రాలపల్లి, టి.కొత్తపల్లి, రామరాజుపల్లి, రాయలచెరువు గ్రామాల మీదుగా కొనసాగింది. రాయలచెరువులో రాత్రికి బస చేశారు. కమ్మవారిపల్లి వద్ద నిరుద్యోగ యువతతో భేటి అయ్యారు. నగరూరు వద్ద రైతులతో సమావేశం అయ్యారు. తుట్రాలపల్లి ఎస్సీ కాలనీలో సీనియర్ సిటిజన్లు, పట్టు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రామరాజుపల్లిలో ఎన్టీఆర్ గహాల బాధిత లబ్ధిదారులతో మాట్లాడారు. సాయంత్రం రాయలచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో టిడిపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన కొనసాగుతోందన్నారు. ప్రజలపై భారాలు, వేధింపులు అధికం అయ్యాయన్నారు. రూ.10 ఖాతాలో వేసి రూ.100 దొడ్డిదారిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లాగేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల మందు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ పూర్తి చేయని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. అందుకే ప్రజలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు తాడేపల్లి కంపించిందన్నారు. ఈ పరిస్థితుల్లో వారి ఉనికిని చాటుకునేందుకే జగనే మా నమ్మకం అంటూ ఎమ్మెల్యేలకు స్టిక్కర్లు, బ్యాగులు ఇచ్చి రోడ్లపైకి పంపారన్నారు. జగన్మోహన్‌రెడ్డిది రాజారెడ్డి రాజ్యాంగం అయితే, టిడిపిది అంబేద్కర్ రాజ్యాంగం అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు రద్దు అవుతాయనే ప్రచారాన్ని వైసిపి నేతలు వాలంటీర్ల ద్వారా చేయిస్తున్నారని, దీనిని ఎవరూ నమ్మొద్దన్నారు. సంక్షేమానికి పట్టినిల్లు టిడిపి అని, ప్రజలకు మరిన్ని పథకాలను అందించి వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక తాడిపత్రి ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందోని లోకేష్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ దోపిడీ జరుగుతోందని చెప్పారు. 40 ఏళ్లు ఉండాడిల్సిన ఇసుకను ఈ నాలుగేళ్లలో దోచేశారన్నారు. ఈ దోపిడీ పాలనకు ప్రజలు అంతం పలకాలన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రక్షణగా నిలుస్తామన్నారు. బిసి కార్పొరేషన్లను పటిష్ట పరిచి, దామాషా పద్ధతిలో నిధులు కేటాయిస్తామన్నారు. స్థానిక సంస్థల్లోనూ ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బిసిలతో పాటు, ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలను ఆదుకునే చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఏడాదీ జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పన్నుల భారాలను తగ్గించే చర్యలను తీసుకుంటామ్మరు. తాడిపత్రి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలకు ప్రోత్సాహాలను అందిస్తామన్నారు. వాటిపై పన్నుల భారాలను తగ్గించి మూతబడిన గ్రానైట్ పరిశ్రమలను తెరిపిస్తామన్నారు. తాడిపత్రి ప్రాంతంలో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేసి కార్మికులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు అండదండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సొంత మనుషులకే రక్షణ లేదు
జెసి.అస్మిత్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆయన సొంత మనుషులకే రక్షణ లేదని, ఇక ప్రజల గురించి ఏమి ఆలోచిస్తారని తాడిపత్రి టిడిపి నియోజకవర్గం జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. యువగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇదే పాలన కొనసాగితే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకుని పోయిన గౌరవాన్ని రాష్ట్రానికి తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధి, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి.అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

అనంతపురం కలెక్టరేట్ : ఎంసెట్, నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరంలో ఎంసెట్, నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థుల నుంచి కోచింగ్ సెంటర్ల యాజమాన్యం వేలాది రూపాయలు దండుకుంటోందని మండిపడ్డారు. ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం ముగిసిన వెంటనే నగరంలో కొంతమంది ఎంసెట్, నీట్ పేరుతో కోచింగ్ సెంటర్లను ప్రారంభించి వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఎంసెట్, నీట్ ఐఐటి, వంటి పరీక్షలు రాసి మంచి ర్యాంకు సంపాదించి ఉన్నతమైన విద్యను అభ్యసించాలని కోరుతున్నారని తెలిపారు. విద్యార్థులను ఆసరాగా చేసుకున్న కొంతమంది షార్ట్ టర్మ్ కోచింగ్ సెంటర్లను ప్రారంభించారని తెలిపారు. ఈ కోచింగ్ సెంటర్లకు ఎలాంటి అనుమతి, నిబంధనలు లేవన్నారు. నగరంలో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పోస్టర్లు వేసి విద్యార్థులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ కోచింగ్ సెంటర్లు ఇరుకు గదుల్లో క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా నైతికంగా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల నుంచి రూ.వేలు, లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఒక వైపు లక్షల రూపాయలు వసూలు చేస్తూనే కోచింగ్ సెంటర్లు మరొక వైపు విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు.

జిల్లాకు100 టిఎంసిల నికర జలాలు కేటాయించాలి

రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వెనుకబడిన అనంతపురం జిల్లాకు 100 టిఎంసిల నికర జలాలు కేటాయించి రైతులు పంటలు సాగు చేసుకునేలా ప్రభుత్వం సహకరించాలని పలు రైతు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం భారత్ ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వికె.భవన్‌లో సమావేశం నిర్వహించారు. భారత ప్రజా రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి, అనంతపురం పండ్ల తోటల రైతు సంఘం అధ్యక్షుడు అనంత రాముడు, ఇంటాక్ జిల్లా అధ్యక్షుడు రాంకుమార్, బెస్త సంఘం అధ్యక్షుడు కెవి.రమణ తదితరులు హాజరై మాట్లాడుతూ జిల్లా రైతులకు సాగు నీరు 100 టిఎంసిలు నికర జలాలు కేటాయించాలన్నారు. పండ్ల మార్కెట్‌లో దళారి వ్యవస్థను రూపుమాపాలని డిమాండ్ చేశారు. రైతులకు 100 శాతం సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలన్నారు. చుక్కల భూమి రిజిస్ట్రేషన్ చేయడంలో జిల్లా వెనుకబడి ఉందని, తక్షణమే వేగవంతం చేసి చుక్కల భూమి రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం చెప్పిన విధంగా రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాల్సిందే..

తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సొంత ఇల్లు, స్థలాలు లేని నిరు పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పేదలకు ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ఆవరణంలో బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ నగర్‌లో దాదాపు 300 కుటుంబాలు 20 సంవత్సరాల క్రితం గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటి దాకా ఆ కాలనీవాసులకు అధికారులు పట్టాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఐదు ప్రభుత్వాలు మారినా నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయడం దుర్మార్గం అన్నారు. రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారికి స్థలాలు చూపించాలని ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. అధికారుల జాప్యంతోనే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ స్థలాలను మాత్రం కొందరు కబ్జా చేసి వందల కోట్లు గడిస్తున్నారని తెలిపారు. పేదలు సెంటు భూమి ఇవ్వమంటే ప్రభుత్వం, అధికారులు ఎక్కడా లేని నిబంధనలు, చట్టాలు అమలు చేస్తారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలన్నారు. భూ కబ్జా చేస్తున్న పెద్దలపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 4-7 ఎ, 4-7బి, 4-8 ఎ, 4-8 బి ప్రభుత్వ భూమి పేదలకు పంచాలని కోరారు.

మండుటెండలోనే చంటి బిడ్డలతో మహిళల నిరసన

తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం చేపట్టిన ఆందోళనలో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున హాజరై నిరసన తెలిపారు. చంటి బిడ్డల తల్లులు మండుటెండను సైతం లెక్క చేయకుండా అధికారులు, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. చంటి పిల్లలు ఏడుస్తుంటే ఆవరణంలోని చెట్లకు చీరలతో ఊయలలు కట్టి ఊపుతూ నిద్రపుచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ రాజా వచ్చి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్వీకరించారు. తహశీల్దారు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు వెళ్లారని, ప్రజా సమస్యలను తహశీల్దార్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి హామీలు అనేక మార్లు ఇచ్చారని, ఆచరణకు నోచుకోలేదన్నారు. కచ్చితమైన హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. అధికారులతో మాట్లాడి శ్రీ శ్రీ నగర్‌కు సంబంధించి పట్టాలు ఈ నెల చివరి నాటికి ఇంటికే వచ్చి పట్టాలిస్తామన్నారు. రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి పేదలకు అందజేస్తామని మిగిలిన సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ముట్టడి కార్యక్రమాన్ని విరమించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వెంకటనారాయణ, ముస్కిన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వలీ, మసూద్, బాబు, రాజు, గఫూర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేశు, ప్రసాదు, ఎన్టీఆర్ శీనా, ఎర్రిస్వామి, రజక వృత్తిదారుల సంఘం నాయకులు నాగభూషణం, సిపిఎం ఎంపిటిసి సభ్యురాలు రమీజాభీ, రాము, ఇస్మాయిల్, రామాంజి, షరీఫ్, పీరా, మోహన, లాలెమ్మ, మాబున్నీ, నవనీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

సంక్షేమ పథకాల అమల్లో మహిళలకే అగ్రస్థానం

ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

సంక్షేమ పథకాల అమలులో మహిళలకి అగ్రస్థానం ఇచ్చిన జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం నలగొండ గ్రామంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అన్నింటినీ 99 శాతం నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయలేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. కరోనా మహమ్మారి లేకపోతే పరిశ్రమలు ఏర్పాటుచేసి లక్షల్లో ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. పిల్లల చదువుకి ఎంతో శ్రద్ధ చూపుతున్న ఆయన భవిష్యత్తులో వారి అభివృద్ధికి ఎన్నో ఉద్యోగాలు సృష్టి చేయగల మహా సమర్థ నాయకుడు జగన్ అన్నారు. ఎంపీపీ వాల్మీకి మాధవి మాట్లాడుతూ టిడిపి హయాంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, గుంతల రోడ్లు దర్శనమిచ్చేవని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి నాడు నేడు కింద కొత్త భవనాలు నిర్మించారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. అనంతరం రూ.6.15 కోట్లు ఆసరా చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభావతి, సర్పంచి భాగ్యమ్మ, జెడ్పిటిసి కదిరప్ప, సింగిల్ విండో ఛైర్మన్, వైసిపి మండల కన్వీనర్ మోహన్, ఎంపీడీవో జాషువా, యుఆర్‌డి బారెన్ సాహెబ్, ఏపీఎం రామ్మూర్తి, మండల స్థాయి అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి : కలెక్టర్

కళ్యాణదుర్గం : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని జిల్లా కలెక్టర్ గౌతమి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోళ్ల గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందిని తమ విధులు, బాధ్యతలపై ప్రశ్నించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ముఖ్యమంగా నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్లకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ప్రతి ఉద్యోగికి ఆన్‌లైన్ హాజరు నమోదు తప్పని సరిచేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డిఎల్‌డిఒ శంకర్, ఈవోఆర్డీ బాలాజీ, తహశీల్దార్ నాగరాజుపాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి గుంతకల్లు రూరల్

'అనంతలో మరో ఉద్దానం' అనే శీర్షికతో నాలుగు రోజులుగా ప్రజాశక్తిలో కథనాలు వెలవడం, నాయకుల పరామర్శలతో అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. నాగసముద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ నవీన్ బాబు ఆధ్వర్యంలో ములకలపెంట గ్రామంలో 102 మందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఏడుగురికి కిడ్నీ వ్యాధి సోకగా ఇప్పటికే ఇద్దరు మరణించారు. మరో ఐదుగురు మంచాన పడ్డారు. బుధవారం నిర్వహించిన పరీక్షల్లో రంగడు, హంపమ్మలకు కూడా కిడ్నీ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మరో 26 మందికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లుగా భావించి సిరం టెస్ట్ చేయించుకోవాని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్లు కుమారస్వామి, బాషా, ఆశా వర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ ఆరోపణలను ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

యువగలం పాదయాత్రలో లోకేష్ బాబుతో ఏ విధమైన ఆరోపణలు చేయించినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగలం పాదయాత్ర తాడిపత్రి నియోజకవర్గంలో రెండవ రోజూ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నాడు స్వాతంత్ర్య కోసం జైలు కెళ్తే.. నేడు ప్రభుత్వ వేధింపులతో జైలుకు వెళ్తున్నారని కరపత్రాలు పంపిణీ చేయడం తాడిపత్రి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి స్పందించారు. ప్రభాకర్‌రెడ్డి మూర్ఖుడని.. కేసులన్నీ టిడిపి ప్రభుత్వంలో బనయించబడినవే అన్నారు. ఆరోజున 800 మంది జనంతో ఆశ్రమం మీద దండయాత్రగా వెళ్తే తూతూమంత్రంగా కేసు నమోదు చేశారన్నారు. బాధితులు రిజిస్టర్ పోస్టు ద్వారా కేసులు నమోదు చేసుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అప్పటి సీసీ ఫుటేజీలు, విజువల్స్‌ను బట్టి వ్యక్తులను గుర్తిస్తూ కేసులు నమోదు చేశారన్నారు. ఆరోజు టిడిపి ఎంపీగా దివాకర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తాళాలు వేసిన ఘనతను స్థానిక ప్రజలు మరువలేదన్నారు. బిఎస్-3, బిఎస్-4 వాహనాల నకిలీ ఇన్సూరెన్స్‌లు, ఫోర్జరీ సంతకాల కేసులు అక్రమ కేసులు అంటూ జెసి.బ్రదర్స్ లోకేష్ వద్ద అమాయకత్వాన్ని ఒలకబోస్తున్నారని అన్నారు. వారిపై ఉన్న అవినీతి, ఆరోపణలను లిఖిస్తే రామాయణం, భారతం కంటే ఎక్కువ పేజీలు అవుతాయన్నారు. ఇసుక గవర్నమెంట్ పాలసీ అన్నారు. దీనిపై ఆరోపణలు అవాస్తవం అన్నారు. దీనిపై లోకేష్ కమిటీ వేసి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. తాడిపత్రి ప్రాంతంలో గతంలో 700 నల్ల బండల యూనిట్లు, 300 గ్రానైట్ యూనిట్లు కొనసాగుతుండేవని తెలిపారు. ఆ రోజుల్లో ప్రయివేటు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి ఆ పరిశ్రమలను నిర్వీరం చేశారన్నారు. అనేకమంది ఉపాదిని దెబ్బతీశారన్నారు. జేసీ బ్రదర్స్ మాటలు విని లోకేష్ ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

మార్చ్ ఫాస్ట్ పోటీల్లో మెరిసిన అనంత మెడికోలు

వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో మెడికల్ కాలేజి సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి మార్చ్ ఫాస్ట్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డాక్టర్ బాబ్జి చేతుల మీదుగా తమ విద్యార్థులు మెమెంటో అందుకున్నారని చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహ నాయక్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. నెల్లూరు జిల్లాలోని నారాయణ మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలలో అనంత మెడికోలు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర పోటీలలో పాల్గొనబోతున్నారు. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో 62 మంది మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా తమ వైద్య విద్యార్థులు మంచి ప్రతిభ చూపిస్తున్నారని కొనియాడారు. ప్రారంభోత్సవంలోనే జరిగిన మార్చ్ ఫాస్ట్ పోటీలో తృతీయ బహుమతి సాధించి కళాశాల ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ రఘునందన్, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ కెఎల్.సుబ్రహ్మణ్యం, ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

రంజాన్ కానుకలు పంపిణీ

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని మక్కా మసీద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 300 మంది ముస్లిం నిరుపేద కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దారు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ.. నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. ఇలాంటి దాతృత్వం ముస్ముందు కొనసాగాలని కోరారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, మసీదు కమిటీ అధ్యక్షులు ఖలీల్, కార్యదర్శి యూనస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలీ బాషా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ శర్మాస్, అధ్యాపకులు అయూబ్ ఖాన్, అబ్దుల్ బారి, మక్కా మసీద్ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్, సభ్యులు దాదు ఫరూక్ సుహేల్, సమీర్, నౌషాద్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల కోసం ఆలయాన్ని వాడుకోవడం బాధాకరం

పుట్లూరు : చింతకుంట కాలభైరవ స్వామి ఆలయాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం బాధాకరమని ఆలయ అర్చకులు చంద్రమౌళి, రామసుబ్బయ్య, శివ నాగేంద్ర మూర్తి, శివసాగర్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం అధికార పార్టీ నాయకులు రూ.10 లక్షలు అడిగారని ఈ నెల 8న యువగళంలో నారా లోకేష్ చేత అసత్య ఆరోపణలు చేయించడం బాధాకరమన్నారు. ఆలయం కోసం ఇచ్చే వారు ఉన్నారు కానీ తీసుకునే వారు లేరన్నారు. ఆలయ నిర్మాణం కోసం చందాలు వసూలు చేసి ఖర్చు అయినట్లు ఆలయ పున్ణ నిర్మాణ కమిటీలోని కొందరు సభ్యులు చూపారని అన్నారు. కనీసం అర్చకులను కమిటీలో లేకుండా చేశారన్నారు. ఎన్నో తరాలుగా అర్చకులుగా ఉన్న తమను కించ పరచడం, ఆలయంలో లేకుండా చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. అయితే ఆలయ నిర్మాణం కోసం టెండర్లు పూర్తి కాగా అందులో తమ అభ్యంతరాలను దేవాదాయ శాఖ అధికారులకు పిర్యాదు చేయడంతో ఆలయ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి దేవుడి విషయంలో అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు

బుక్కరాయసముద్రం : శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. బుధవారం ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానంలో అత్యల్ప వర్షపాత మండల పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురం, సత్యసాయి జిల్లా, కర్నూలు నంద్యాల జిల్లాల నుండి శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే వివిధ పంటలలో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలు వివరించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం మీద విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. పరిశోధనలు చేసిన విత్తనాలను రైతులకు 50 శాతం నుండి 70 శాతం వరకు అందిస్తున్నామని అన్నారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం చేయడానికి కూలీల కొలత చాలా ప్రధానమైన సమస్య అన్నారు. యాంత్రీకరణ చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గించవచ్చన్నారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్వీ వెంకటేశ్వర్లు, అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ ఫలితాలు, నూతన వంగడాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, అనంతపురం జిల్లా వైవి సుబ్బారావు, సత్యసాయి జిల్లా మోహన్‌రావు, నంద్యాల జిల్లా పిఎల్ వరలక్ష్మి, కర్నూలు జిల్లా జిల్లా సలహా మండలి ఛైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరు : మండల పరిధిలోని నామానాన్కుపల్లి గ్రామంలో కాలువపై నూతనంగా ఏర్పాటు చేస్తున్న వంతెన పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా వంతెన నిర్మించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక వైసిపి నాయకులకు సూచించారు. సర్పంచి అశ్విని వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

గుత్తి : పట్టణంలోని 4, 8వ సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. హాజరు, జాబ్ చార్టులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవా భావంతో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించాలన్నారు. ప్రధాన రహదారుల్లో పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీలను పెంచండి

శెట్టూరు : ఉపాధి కూలీలను పెంచాలని ఇఒఆర్‌డి గంగావతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఫీల్ట్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ..కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆరు వేల మందికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వినతి

గుంతకల్లు రూరల్ : కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు తహశీల్దార్ బి. రాముకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం గడువు ఈనెల 14వ తేదీకి ముగియనుందన్నారు. అనాథ పిల్లలకు ఎంతగానో ఉపకరించే ఈ పథకానికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు కీలకమన్నారు. త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. రమేష్, వైసిపి స్టూడెంటు యూనియన్ లీడర్ వంశీ యాదవ్, మైనారిటీ నాయకులు షాబుద్దీన్ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

నార్పల : నార్పల మండలం శిద్దరాచెర్ల పంచాయతీ మాలవాండ్లపల్లి ఆర్‌డిటి స్కూలు అవరణంలో సర్పంచి రామాంజినేయులు ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి వారి సహకారంతో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గుండె పరీక్షలు చేయించుకుని, జాగ్రత్తలు తీసుకుని గుండెను కాపాడుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, వార్డుమెంబర్ దారా ఉమాపతి, ఉపాధ్యాయులు సురేఖ, శ్రీనివాసులు, మేనేజర్ ఆరీఫ్, పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ఉరవకొండ : మండలంలోని మోపిడి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచి సిద్దార్థతో కలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఆమిద్యాల పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, నాయకులు అశోక్ కుమార్, గోవిందు, ఆమిద్యాల రాజేష్, మోపిడి ఆంజనేయులు, సుధాకర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని మాముడురు గ్రామంలో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రామాంజనేయులు అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మాముడురు గ్రామానికి చెందిన రామాంజనేయులు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండేవాడు. పలు చోట్ల చికిత్స చేయించుకున్నప్పటికి వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రామాంజనేయులు ఈ నెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని మాసినేని పాఠశాల వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బ్యాంకు ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని బండగేరికి చెందిన రామకృష్ణ పామిడిలోని ఓ జాతీయ బ్యాంకులో పనిచేస్తున్నారు. విధుల నిమిత్తం ఆయన ద్విచక్ర వాహనంలో బ్యాంకుకు వెళుతుండగా పంది అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

ఉరవకొండ : ఉరవకొండ మండలం నెరమెట్ల గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అనే రైతుకి చెందిన మొక్కజొన్న పంట బుధవారం అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. బాధిత రైతు రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట చేతికొచ్చింది. కోతకు మిషన్ దొరకకపోవడంతో పంట తొలగించడం ఆలస్యం అయ్యింది. అయితే పంట మొత్తం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, ఎవరైనా నిప్పు పెట్టారా అన్నది తెలియరాలేదు. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సర్పంచి యోగేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో పంట నష్టపోయిన రైతును ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. పంట ఏ విధంగా అగ్నికి ఆహుతి అయిందో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టాలన్నారు.

పుట్లూరు : మండలంలోని అరకటివేముల గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి మొక్కజొన్న కంకులు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రైతు రామాంజనేయులు 2 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కాలం పూర్తయిన తర్వాత కంకులను వేరు చేసి నిల్వ ఉంచారు. బుధవారం మంటలు వ్యాపించి కంకులు దగ్ధమయ్యాయి. రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నాడు.

వీధికుక్క దాడిలో బాలుడికి గాయాలు

ఉరవకొండ : ఉరవకొండ మండలం లత్తవరం తండా గ్రామానికి చెందిన సుంకే నాయక్ (4) అనే బాలుడిని వీధి కుక్క బుధవారం తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన బాలుడిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడు ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

సిఎం సభా వేదిక స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

నార్పల : నార్పల మండల కేంద్రానికి ఈనెల 17వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రానుండడంతో ఆయన ప్రసంగించే సభా వేదిక స్థలాన్ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆయనతోపాటు డిఎస్‌పి ప్రసాదరెడ్డి, సిఐ అస్రార్ బాషా, ఎఎస్ఐ ఈశ్వరయ్య వైసీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, తహశీల్దారు నారాయణస్వామి, ఎంపీడీవో దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఎఎస్ఐకి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనంతపురం సిటీ : అనారోగ్యంతో మృతిచెందిన గుత్తి ఎఎస్ఐ లూకయ్య పార్థివదేహానికి స్థానిక జెఎన్టీయు రోడ్డులోని క్రైస్తవ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు ఎఎస్ఐ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు, కడప జిల్లాకు చెందిన లూకయ్య 1990 లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. అనంతపురం ట్రాఫిక్, కసాపురం, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, గుత్తి పోలీసు స్టేషన్లలో పని చేశారు. ఆయనకు భార్య కనకమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల్లో గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, గుత్తి సిఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, గుత్తి పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్ఐ లూకయ్యకు ఘన నివాళి

గుత్తి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఎఎస్ఐ లూకయ్యకు గుత్తిలో ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఎఎస్ఐ చిత్రపటాన్ని ఉంచి పూలమాల లేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంజన ప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి ఖాశీం, సిపిఐ నాయకులు రామదాసు, పూల మాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు సుధాకర్ నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షులు బోర్ వెల్స్ నాగరాజు, ప్రభాకర్ నాయుడు, గిరి ప్రసాద్ నాయుడు, శ్రీకరం ధనుంజయ, మోహనదాసు, సుంకన్న, ఆటో యూనియన్ నాయకులు నాగార్జున, అంజి, హనుమయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఈరన్న, బి.రాము, షఫీ, కిషోర్, ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

16న ఉచిత కంటి వైద్యశిబిరం

గుత్తి : ఈనెల 16వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్నూలులోని మోడ్రన్ ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ జి.రాజశేఖర్, డాక్టర్ జి.అనిల్‌కుమార్ చికిత్సలు నిర్వహిస్తారని చెప్పారు. పట్టణంలోని మహర్షి దయానంద గురుకులంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎడిసిసిబి ఛైర్‌పర్సన్

అనంతపురం : ఏడీసీసీ బ్యాంకు ఛైర్ పర్సన్ కుమారి లిఖిత జిల్లా నూతన జిల్లా కలెక్టరు గౌతమీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాంకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మాజీ ప్రెసిడెంట్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన

ఆత్మకూరు : ఆత్మకూరు కేంద్రంలోని నార్త్ స్కూల్లో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర అబ్జర్వర్ బుధవారం పరిశీలించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యే లోపు ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుకలో భాగంగా టెక్స్ట్ బుక్కులు, స్కూలు బెల్ట్, నోట్ పుస్తకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్టాక్ పాయింట్లను పాఠశాలల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు

హై ఓల్టేజీతో కాలిన విద్యుత్ పరికరాలు

గుత్తి : పట్టణంలోని ఉప్పర వీధిలో బుధవారం తెల్లవారుజామున హై ఓల్టేజీతో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. వీధిలోని దాదాపు 20కి పైగా నివాసాల్లో ఒక్కసారిగా హై ఓల్టేజ్ రావడంతో ఫ్యాన్లు, టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. ఉప్పర వీధిలో గత 15 రోజులలో గృహాలకు హై ఓల్టేజ్ రావడం ఇది రెండవ సారి అని బాధిత మహిళలు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.